క్లుప్తంగా

ఉపాధ్యాయ సంఘం డైరీ ఆవిష్కరణ


సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

పాయకరావుపేట : ఎస్సీ, ఎస్టీ యుఎస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా స్థాయి సమావేశం పట్టణంలో గల నాగనరసింహ పాఠశాల్లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా సంఘం రాష్ట్ర ప్రతినిధి చందోలు వెంకటేశ్వరరావు, జిల్లా ఉపవిద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.ప్రేమ్ కుమార్ హాజరై ఉపాధ్యాయుల సమావేశంలో ప్రసంగించారు. అనంతరం సంఘం డైరీ అతిథులు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి కె.ఎస్.గాంధీ, సంఘం మండల అధ్యక్షుడు ఆనంద్, సంఘం ప్రతినిధులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి


కార్యక్రమంలో పాల్గొన్న ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ రమణ తదితరులు

మునగపాక : ప్రతి ఒక్కరూ హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలని సమరసత సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ బీవీ రమణ కోరారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మునగపాక సంతబయిల రామాలయంలో హిందూ ధర్మ ప్రచారంపై కరపత్రాల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ధర్మాన్ని కాపాడాలన్నారు. అలాగే దేవాలయాలను సందర్శించడం ద్వారా మానసిక ప్రశాంతత దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ ధర్మ ప్రచారకుడు కొల్లి అప్పారావు, మండల శాఖ అధ్యక్షుడు ఆడారి లక్ష్మణరావు పాల్గొన్నారు.

నేడు అభయాంజనేయ స్వామి వార్షికోత్సవం


వార్షికోత్సవ వేడుకకు ముస్తాబైన అభయాంజనేయస్వామి

ఎస్.రాయవరం : గోకులపాడు గ్రామంలో అభయాంజనేయ స్వామి వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి ఏడాది ఈ స్వామి వేడుక గ్రామస్తులందరూ అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ వేడుకను పురస్కరించుకుని క్రీడా పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు.

చోడపల్లిలో పేదలకు బియ్యం పంపిణీ


పేదలకు బియ్యం అందజేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని చోడపల్లిలో స్థానిక చర్చి పాస్టర్ ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేదలకు బియ్యం బస్తాలను పంపిణీ చేశారు. పది మంది బేడ జంగాలకు చెందిన నిరుపేద మహిళలకు పాస్టర్ రాజశేఖర్ చేతుల మీదుగా అందజేశారు.

కొనసాగుతున్న ధర్నా

రాంబిల్లి: నేవీ నిర్వాసితులు, నేవీ నిర్వాసిత గ్రామాల ప్రజలు నిర్వహిస్తున్న ధర్నా కొనసాగుతుంది. ఆదివారం నాటికి ధర్నా 98 రోజులకు చేరుకుంది. వాడనర్సాపురం, కొత్తపట్నం, వాడపాలెం, నేవీ పునరావాసకాలనీ, గోవిందపాలెం, కొప్పుగొండుపాలెం, చినకలవలాపల్లి, కొత్తపేట గ్రామాల ప్రజలు ఈ ధర్నాలో పాల్గొన్నారు.

జీడి పూతకు మంచు కాటు


విరబూసిన మామిడిపూత


జీడి పూతకు స్ప్రే చేస్తున్న రైతు

కోటవురట్ల : జీడి మామిడి, మామిడి రైతులకు మంచు కాటు తప్పడంలేదు. ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా పడడంతో మామిడి, జీడి మామిడి తోటలు విరబూశాయి. పూత ఆశాజనకంగా ఉండడంతో రైతుల్లో ఎన్నో ఆశలు పట్టుకొచ్చాయి. అయితే మంచు దెబ్బకు జీడి, మామిడి రైతులకు నష్టం తప్పేటట్టు లేదు. తెల్లవారు జామున మంచు విపరీతంగా అలుముకోవడంతో పూత మాడిపోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతం పూత రాలకుండా, మాడిపోకుండా ఉండేందుకు రైతులు పురుగు మందు స్ప్రే చేస్తున్నారు. నియోజకవర్గంలో వరి తర్వాత అత్యధికంగా సాగులో ఉన్న పంట జీడి, మామిడి. పాయకరావుపేట మండలంలో 3 వేల హెక్టార్లు, నక్కపల్లి మండలం 4 వేల హెక్టార్లు, ఎస్.రాయవరం మండలం 1700 హెక్టార్లు, కోటవురట్ల మండలంలో 4,500 హెక్టార్లలో జీడి, మామిడి తోటలు ఉన్నాయి. ప్రస్తుతం పొగమంచు కారణంగా జీడిలో టీ దోమ, మామిడిలో తేనెమంచు పురుగు ఉధృతి కనిపించే అవకాశం ఉంది. పంటను దక్కించుకునేందుకు రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా రైతులు ముమ్మరంగా పురుగు మందులు స్ప్రే చేస్తూ బిజీగా ఉన్నారు.

పొగమంచుతో నష్టమే..



పొగమంచు కారణంగా జీడి, మామిడి తోటలకు తీవ్ర నష్టం కలుగుతోంది. పూత బాగున్నా పొగమంచు కారణంగా మాడిపోతోంది. పూత నిలిచేందుకు, మాడిపోకుండా ఉండేందుకు మందులు స్ప్రే చేస్తున్నాం.

– గొల్లు చిట్టిబాబు, రైతు, కె.వెంకటాపురం

తేనె మంచు పురుగు ఉధృతి

ప్రస్తుతం పొగమంచు ఎక్కువగా ఉంది. దీని కారణంగా జీడిలో టీ దోమ, మామిడిలో తేనెమంచు పురుగు ఉధృతి పెరుగుతుంది. ఈ కారణంగా పూత మాడిపోయి తీవ్ర నష్టం వస్తుంది. టీ దోమ నివారణకు లీటరు నీటిలో 1.6 మి.లీ మోనోక్రోటోపాస్‌తో పాటు 3 గ్రా. బ్లైటాక్స్ కలిపి పిచికారి చేయాలి. తేనె మంచు పురుగు నివారణకు 4 లీటర్ల నీటిలో 1 మి.లీ ఇమిడా క్లోరిపైడ్ మందును కలిపి పిచికారీ చేయాలి. తెల్లవారు జామున, సాయంత్రం సమయంలో స్ప్రేచేయాలి. ఎండలో స్ప్రేచేయకూడదు. పూత, కాండం, చెట్టు మొదలు తడిసేలా స్ప్రేచేయాలి. పూత విచ్చుకున్న దశలో స్ప్రే చేయకూడదు. ఆకు, పిందె దశలో మాత్రమే మందు స్ప్రేచేయాలి.

– ఉమా మహేశ్వరి, ఉద్యానవనశాఖాధికారి, పాయకరావుపేట

శారదా నదిపై తాత్కాలిక రహదారి నిర్మాణం


నదిపై నిర్మించిన తాత్కాలిక రహదారిని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

రాంబిల్లి : రజాల వద్ద మేజర్ శారద నదిపై తాత్కాలిక రహదారిని నిర్మించారు. నదిలో నీరు ప్రవహించేందుకు అవసరమైన తూరలు ఏర్పాటు చేసి వాటిపై కంకర వేసి రాకపోకలు సాగించేలా రహదారిని నిర్మించారు. రజాల, పెదకలవలాపల్లి, వై.లోవ గ్రామాలకు సంబంధించిన నిధులు, మండల పరిషత్ నిధులతో ఈ పనులు చేశారు. ఈ రహదారిని ఎంపీపీ జి. శిరీషశ్రీనుబాబు, పెదకలవలపల్లి, రజాల, వై.లోవ సర్పంచ్‌లు యలమంచిలి కనకారావు, పొన్నాడ లక్ష్మీశ్రీనివాసరావు, బద్ది నారాయణరావు, వైఎస్సార్‌సీపీ నేత అండె ఈశ్వరరావు పరిశీలించారు. ఈ రహదారి నిర్మాణంతో 8 గ్రామాల ప్రజలకు మండల కేంద్రం రాంబిల్లి వెళ్లేందుకు దాదాపు 10 కిలోమీటర్లు దూరం తగ్గనుంది.

నేడు వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణ


అచ్చియ్యనాయుడు, వైఎస్సార్‌సీపీ కన్వీనర్

మునగపాక: మునగపాక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 13 సచివాలయాలు, మధ్యాహ్నం 8 సచివాలయాలకు సంబంధించి జరిగే శిక్షణ కార్యక్రమానికి ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు (కన్నబాబురాజు), నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు రొంగలి జగన్నాథం, గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ హాజరవుతారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరుకావాలని అచ్చియ్యనాయుడు కోరారు.

ఘనంగా తీర్థ మహోత్సవం


పడమటమ్మను దర్శించుకుంటున్న ప్రజలు


కశింకోటలో ఎడ్ల బళ్ల పరుగు పోటీలు

కశింకోట : కశింకోటలోని కస్పావీధిలో ఆదివారం సాయంత్రం పడమటమ్మ తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పడమటమ్మ విగ్రహాన్ని అందంగా అలంకరించారు. అమ్మవారిని ప్రజలు అధిక సంఖ్యలో దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎండ్ల పరుగు పందెం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆట వస్తువుల అమ్మకాలు జోరుగా సాగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఎడ్ల బళ్ల విజేతలు

పడమటమ్మ తీర్థ మహోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పోటీలో అనకాపల్లి మండలం కూండ్రంకు ప్రథమ స్థానం, చోడవరం మండలం నరసయ్యపేటకు చెందిన రెండు బళ్లకు ద్వితీయం, తృతీయ బహుమతులు వరుసగా లభించాయి. మాడుగుల మండలం కె.జె.పురానికి చతుర్థి బహుమతి లభించింది. ఈ మేరకు నగదు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. పోటీలను స్థానికులు ఉత్సాహంగా తిలకించారు.

వృద్ధులను ప్రభుత్వం ఆదుకోవాలి

అనకాపల్లిటౌన్ : వృద్ధులను అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకోవాలని వయోవృద్ధుల సంక్షేమ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావు కోరారు. పట్టణంలోని గవరపాలెం వీవీ రమణ రైతుభారతి హాల్లో ఆదివారం నిర్వహించిన వృద్ధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొడుకులు, కోడళ్లకు భారంగా మారిన వృద్ధులకు ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలని కోరారు. పెన్షన్ పెంపు, బస్సు, రైలు చార్జీల్లో రాయితీలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, వృద్ధులు పాల్గొన్నారు.

సొంతింటి కల.. ఉగాదికి నెరవేరేలా!

- ఐదు గ్రామాలకు ఒకే చోట జగనన్న కాలనీలో ఇళ్లు
- శరవేగంగా తేగాడ జగనన్న లే అవుట్లో నిర్మాణాలు


అందంగా నిర్మించిన ఇళ్లు


స్తంభాలు వేసి కాలనీకి విద్యుత్ సదుపాయం

కశింకోట : మండలంలోని తేగాడ వద్ద వైఎస్సార్ జగనన్న గృహనిర్మాణ లే-అవుట్‌లో ఉగాది నాటికి గృహప్రవేశానికి వీలుగా ఇళ్ల నిర్మాణాలు ఊపందుకున్నాయి. ఐదు గ్రామాలకు కలిపి ఒకే చోట గృహ నిర్మాణాలకు స్థలాలు మంజూరు చేశారు. సుమారు 250 మందికి ఇక్కడ ఇళ్ల పట్టాలు ఇచ్చారు. వీటిలో ఇప్పటికే సుమారు 30 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. ఓ పది మంది గృహ ప్రవేశాలు కూడా చేశారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాలు కూడా శరవేగంగా జరుగుతున్నాయి.

చుట్టూ..ఆహ్లాదకరం

తేగాడ గ్రామం వద్ద కొండను ఆనుకుని ఎక్కువ విస్తీర్ణంలో ప్రభుత్వ భూమి ఉండటంతో జగనన్న లే అవుట్ వేశారు. ప్లాట్లు విభజించారు. తేగాడతో పాటు చుట్టు పక్కల ఉన్న పేరంటాలపాలెం, జోగారావుపేట, కొత్తపల్లి, బుచ్చియ్యపేట గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఆయా ప్రాంతాల్లో తగిన ప్రభుత్వ భూమి లేకపోవడంతో ఇక్కడ ఒక టిన్న సెంట్ల చొప్పున ప్లాట్లు కేటాయించారు. జగనన్న గృహ నిర్మాణ పథకంలో ఇళ్ల నిర్మాణం కూడా చేపట్టారు. ఈ లే అవుట్‌ను చూస్తే.. చుట్టూ ఆహ్లాదకర వాతావరణంలో ప్రశాంత జీవనానికి ఆలవాలంగా ఉంటుంది.

మౌలిక వసతుల ఏర్పాటు

కశింకోటలోని వడ్డి వీధిలో వేసిన పెద్ద లే అవుట్ తర్వాత తేగాడ లే అవుట్‌లోనే ఎక్కువ గృహ నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటికి ప్రభుత్వం అందిస్తున్న ఇసుక, సిమెంట్, ఐరన్ తదితర నిర్మాణ సామగ్రి, ఆర్థిక సాయంతోపాటు సొంత నిధులతో లబ్ధిదారులతో అందంగా తమ గృహాలు నిర్మించుకుంటున్నారు. వాటికి నీటి సరఫరా కోసం అధికారులు రెండు బోర్లను ఏర్పాటు చేశారు. కుళాయి కనెక్షన్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అలాగే కాలనీ వీధుల వారీగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించారు. కనీస మౌలిక వసతులైన విద్యుత్, నీటి సరఫరా ఏర్పాటుతో ఎలాంటి ఆటంకాల్లేకుండా భవన నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి.

ఉగాదికి దాదాపు పూర్తి

రానున్న ఉగాదికి వీలైనంత మేరకు శతశాతం గృహ ప్రవేశాలు జరగాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఈ మేరకు ఆదేశాలు అందడంతో మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది కాలనీల్లో ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించారు. లక్ష్యాన్ని చేరుకోవడానికి లబ్ధిదారులను ఎప్పటికప్పుడు అన్ని విధాలా అధికారులు ప్రోత్సహిస్తున్నారు. దీంతో లబ్ధిదారులు కూడా తమ సొంతింటి కల నెరవేర్చేకునేందుకు ప్రభుత్వ సాయంతో గృహ నిర్మాణాలను వేగవంతం చేస్తున్నారు. ఉగాదికి దాదాపుగా ఇళ్ల నిర్మాణాలు పూర్తవుతాయని అధికారులు భావిస్తున్నారు.

గిరిజన గ్రామాల్లో ప్రైవేట్ క్రషర్ల ఏర్పాటు


జాలంపల్లి ప్రైవేట్ క్రషర్‌లో పాకం మరగబెడుతున్న దృశ్యం

మాడుగుల రూరల్: మండలంలో పలు చోట్ల ప్రైవేట్ క్రషర్లు ఏర్పాటయ్యాయి. తూర్పు గోదావరి తదితర ప్రాంతాల నుంచి యజమానులు ఈ ప్రాంతంలో డిసెంబర్ నుంచి ఏప్రిల్ వరకు రైతుల నుంచి చెరకు కొనుగోలు చేసి బెల్లం తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తారు. అరకిలో బెల్లం రూ. 50కి విక్రయిస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో వేర్వేరు ప్రాంతాలకు వీటిని తరలిస్తున్నారు. మండలంలో సాగరం, సాగరం కాలనీ, సురవరం, జాలంపల్లి, ఎల్. పొన్నవోలు, గాదిరాయి, చీడికాడ వంటి చోట్ల ప్రైవేట్ క్రషర్లు ఏర్పాటు చేశారు. గత నెల నుంచి ఇవి పని చేస్తున్నాయి. కిర్లంపూడి, ఎర్రవరం తదితర ప్రాంతాల వ్యాపారులు వీటిని కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రషర్ల వల్ల గోవాడ షుగర్స్ పరిధిలో గల చెరకు కాటాలకు చెరకు సరఫరా కాలేదు. ప్రైవేట్ క్రషర్లకి విక్రయిస్తే చెరకు సరఫరా చేసిన వెంటనే పేమెంట్లు చెల్లిస్తుండడంతో చెరకు రైతులు వీరికి ఇవ్వడానికే ఆసక్తి చూపుతున్నారు.

భక్తి శ్రద్ధలతో మాఘ పౌర్ణమి



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న చిక్కాల యూత్


తీరంలో భక్తుల సందడి

పాయకరావుపేట : మండలంలో గల సముద్రతీర ప్రాంతాలు ఆదివారం భక్తులతో కిటకిటలాడినవి. మాఘ పౌర్ణమి సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు తీర ప్రాంతాలకు చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు. మండలంలో గల పెంటకోట, పాల్మన్‌పేట, కుమారపురం, వెంకటనగరం, రత్నయ్యమ్మపేట తీర ప్రాంతాల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. తుని, పాయకరావుపేట, కోటనందూరు తదితర మండలాల నుండి భక్తులు అధిక సంఖ్యలో హాజరై పుణ్యస్నానాలు ఆచరించారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

పాయకరావుపేట : మాఘ పౌర్ణమి సందర్భంగా సముద్ర స్నానాలకు వెళ్లిన భక్తులకు పెంటకోట తీరంలో మజ్జిగ పంపిణీ చేశారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చిక్కాల రామారావు ఏర్పాటు చేశారు. చిక్కాల యూత్ బృందం భక్తులకు మజ్జిగను పంపిణీ చేశారు.

కోటవురట్ల: మాఘ పౌర్ణమి సముద్ర స్నానాలకు మండలం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు రేవుపోలవరం సముద్రతీరానికి ఆదివారం తరలివెళ్లారు. తెల్లవారు జాము నుంచి ఆటోలు, బస్సులలో జనం తరలివెళ్లారు. భక్తుల సౌకర్యార్థం నర్సీపట్నం డిపో నుంచి ప్రత్యేక బస్సులు వేశారు.

గంగాదేవికి పూజలు

రాంబిల్లి: మాఘపౌర్ణమి పుణ్యస్నానాలకు భక్తులు రాంబిల్లి శివారు వాడపాలెం తీరానికి పోటెత్తారు. ఆదివారం తెల్లవారుజామునుంచి పలు ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు ఇక్కడ తీరానికి తరలి వచ్చారు. భక్తిశ్రద్ధలతో భక్తులు బీచ్‌లో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం గంగాదేవి అమ్మవారిని భక్తులు దర్శించుకొని పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జి.శ్రీనుబాబు, పి.కిషోర్, ముసలిరావు తదితరులు గంగాదేవి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. భక్తజనంతో తీరప్రాంతం సందడిగా మారింది. పలు రకాల స్టాల్స్, దుకాణాలను ఏర్పాటు చేశారు. డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ గఫూర్, ఎస్ఐ దీనబంధు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.


రాంబిల్లి శివారు వాడపాలెం తీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం


ఉచిత వైద్య శిబిరం ప్రారంభించిన నాయకులు

పాయకరావుపేట ; ఉచిత వైద్య శిబిరాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ అన్నారు. పట్టణంలో గల పాండురంగ దేవస్థానం కల్యాణ మండపంలో ఉత్తరాంధ్ర జర్నలిస్టు ఫ్రంట్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. యు.జె.ఎఫ్. జిల్లా కార్యవర్గ సభ్యులు తుమ్మలపల్లి కుమార్, నియోజకవర్గ అధ్యక్షులు మానివెలితి వెంకట్‌లు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా యుజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.ఆర్.ఎస్.వర్మ, జెడ్పీటీసీ లంక సూరిబాబు, మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావు హాజరయ్యారు. విశాఖపట్నానికి చెందిన కార్డియాలజిస్ట్ జి.పాల్‌కిరణ్ బృందం రోగులకు హృద్రోగ పరీక్షలు నిర్వహించారు. పట్టణంలో గల హైమా నేత్రాలయ వైద్యులు పిఎస్ఆర్ ప్రసాద్ కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వేమగిరి లక్షణ్, ఎఎంసి వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, జగతా శ్రీను, కేశనకుర్తి సత్తిబాబు, యుజెఎఫ్ ప్రతినిధులు ఎం.వెంకట్, టి.కుమార్ లు పాల్గొన్నారు.

జనరాజ్‌దాస్ ఆశయ సాధనకు పాటుపడాలి


ఆర్ఈసీఎస్ మాజీ చైర్మన్ జనరాజ్‌దాస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మునగపాక : మునగపాక గ్రామాభివృద్ధికి నిరంతరం శ్రమించిన జనరాజ్‌దాస్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని గ్రామీణ యువజన సాంస్కృతిక సంస్థ కన్వీనర్ సూరిశెట్టి రాము కోరారు. గ్రామీణ యువజన మందిరం వద్ద ఆదివారం ఆర్ఈసీఎస్ మాజీ చైర్మన్ స్వర్గీయ పెంటకోట జనరాజ్‌దాస్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. జనరాజ్‌దాస్ చిత్రపటం వద్ద పలువురు నాయకులు, కళాకారులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ విద్యుత్ సబ్‌స్టేషన్, ప్రభుత్వ ఆస్పత్రి, పీఏసీఎస్ భవనం ఏర్పాటుకు జనరాజ్‌దాస్ ఎంతో కృషి చేశారన్నారు. కళాకారులను ప్రోత్సహించడంతో పాటు ఆర్ఈసీఎస్ చైర్మన్‌గా పనిచేసిన కాలంలో వినియోగదారులకు మెరుగైన సేవలందించారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు టెక్కలి కొండలరావు, దాడి మూసిలినాయుడు, కళాకారుడు కాండ్రేగుల జగ్గారావు, పాలసంఘ అధ్యక్షుడు మళ్ల సంజీవరావు, జనరాజ్‌దాస్ సోదరుడు శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి


దీక్షలో కూర్చున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

అనకాపల్లిటౌన్ : సీపీఎస్‌ను తక్షణమే రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి డిమాండ్ చేశారు. స్థానిక నెహ్రూచౌక్ బస్టాప్ వద్ద ఆదివారం యుటీఎఫ్ ఆధ్వర్యంలో సీపీఎస్ సంకల్పదీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చి ఉద్యోగ, ఉపాధ్యాయ జీతాలు సకాలంలో చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. 117 జీవో ద్వారా ప్రాథమిక విద్యను ఉన్నత పాఠశాలలో విలీనం చేసి, ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ఉపాధ్యాయులపై వేధింపులు తగవన్నారు. దీక్షలో యూటీఎఫ్ నాయకులు జి.కోటేశ్వరరావు, గంటా శ్రీరాం, ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు అజయ్‌కుమార్, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోలుగుంటలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

రోలుగుంట: ఇటీవల రేవుపోలవరం సముద్ర ప్రమాదంలో మరణించిన సుర్ల జశ్వంత్ కుమార్ జ్ఞాపకార్థం అతని మిత్రమండలి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. విశాఖపట్నం, మాకవరపాలెం, చోడవరం, రావికమతం, రోలుగుంట, నర్సీపట్నం తదితర ప్రాంతాల నుంచి సుమారు 50 బృందాలు పోటీల్లో పాల్గొననున్నాయని కమిటీ తెలిపింది. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ. 18,000, ద్వితీయ రూ. 12,000, తృతీయ రూ. 8,000, నాల్గవ బహుమతిగా రూ. 4,000 ముగింపు రోజైన 7వ తేదీన ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఇస్తామన్నారు. ఈ నెల 8 నుంచి జరగనున్న శ్రీ గౌరీపరమేశ్వరుల ఉత్సవాల సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు వారు వివరించారు.